# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి

5 | నిజామాబాద్, ఆదివారం 15 సెప్టెంబర్ 2024 | KAMAREDDY


# బాల్కొండ ఖిల్లాలో బాలుడి దారుణ హత్య

- నాలుగు రోజుల క్రితం అదృశ్యం..
- నమ్మించి తీసుకెళ్లి గొంతుకోసిన వైనం?
- ఠాణా ఎదుట బాధితుల ఆందోళన




రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) రాకేశ్ (ఫైల్)

బాల్కొండ, సెప్టెంబర్ 14: బాల్కొండ ఖిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఓ బాలుడ్ని దారుణంగా హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఏసీపీ బస్వారెడ్డి శనివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన కచ్చు మల్లేశ్, భాను దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, భాను పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నది. ఇద్దరు కుమారులలో చిన్నవాడైన రాకేశ్ (12)ను హాస్టల్‌లో వేయగా, అక్కడ ఉండలేనని ఇంటికి తిరిగి వచ్చేశాడు. భాను కుటుంబానికి పరిచయమున్న బాల్కొండకు చెందిన బండి నరేందర్ గత బుధవారం వారి ఇంటికి వచ్చాడు. గణపతులను చూద్దామని చెప్పి రాత్రివేళ రాకేశ్‌ను బైక్‌పై తీసుకెళ్లాడు. ఆ తర్వాత నుంచి బాలుడి ఆచూకీ లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు నరేందర్‌ను ప్రశ్నించగా తనకు తెలియదని చెప్పాడు. బాలుడి తల్లి బాల్కొండ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. మూడు రోజుల నుంచి వెతుకుండగా, శనివారం బాల్కొండ ఖిల్లాలో బాలుడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించిన పోలీసులు.. నరేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**ఠాణా ఎదుట ఆందోళన**


రాకేశ్ విగత జీవిగా పడి ఉండడాన్ని చూసి కన్న తల్లితో పాటు బంధువులు గుండెలు బాదుకున్నారు. మరోవైపు, రాకేశ్‌ను చంపిన నరేందర్‌ను తమకు అప్పగించాలని బాధితులు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. అప్పటివరకు మృతదేహాన్ని తరలించేది లేదని పట్టుబట్టారు. నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయం చేస్తామని ఏసీపీ హామీ ఇవ్వడంతో చివరకు ఆందోళన విరమించారు. మరోవైపు, బాలుడి మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాకేశ్ అదృశ్యమైన రోజు అష్టమి కావడం, మృతదేహంపై ఎలాంటి దుస్తులు లేకపోవడం, కేవలం తలపై మాత్రమే గాయాలు ఉండడంతో క్షుద్రపూజలు చేసి హతమార్చారా? అన్న సందేహాలు వినిపిస్తున్నాయి. మరోవైపు, నరేందర్‌ది నేరపూరిత స్వభావమని, గతంలో నగల కోసం కన్నతల్లిపై దాడి చేసి జైలుకు వెళ్లొచ్చాడని గ్రామస్తులు చెబుతున్నారు.

# టీఎన్జీవో

**ఉద్యోగ సంఘంలో ప్రచ్ఛన్న యుద్ధం**


సీటు వదలం..
టీఎన్జీవోలో అనర్హులు!

- కార్యవర్గంలో ఏండ్లుగా కొందరిదే ఆధిపత్యం
- అంతా తామై నడిపిస్తున్న వైనం
- వారిపై అంతర్గతంగా రగులుతున్న అసమ్మతి సెగ
- రాష్ట్ర నాయకత్వాన్ని కదిలించిన 'నమస్తే' కథనం
- అతి త్వరలోనే కార్యవర్గంలో కీలక మార్పులు
- అనర్హులను తప్పించేందుకు సన్నాహాలు




నిజామాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవో) అసోసియేషన్‌లో అసమ్మతి సెగ మరింత రాజుకుంటున్నది. ఉద్యోగ సంఘంలో ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతున్నది. ఏండ్లుగా పాతుకుపోయి, అంతా తామై నడిపిస్తున్న వారిపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతున్నది. ఇదే అంశాన్ని ఎత్తిచూపుతూ 'నమస్తే తెలంగాణ' ఇటీవల ప్రత్యేక కథనం ప్రచురించిన నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వం రంగంలోకి దిగింది. అసలు టీఎన్జీవోకు సారథ్యం వహించేందుకు అర్హత లేకపోయినప్పటికీ సంవత్సరాల తరబడి తిష్ట వేసిన వారిని తప్పించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగానే రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్ వారం క్రితం నిజామాబాద్‌కు వచ్చారు. సంస్థకు జవసత్వాలు చేకూర్చేందుకు కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్న ఎజెండాతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏమైందో ఏమో కానీ, ఆ సమావేశం ఎటూ తేల్చకుండానే ముగిసింది. అయితే, అటు రాష్ట్ర నాయకత్వం, ఇటు జిల్లా కార్యవర్గం కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ నాయకత్వ మార్పు తథ్యమన్న సంకేతాలను ఇస్తున్నాయి.

**పావులు కదుపుతున్న ఆశావహులు**

కార్యవర్గంలో మార్పులు, చేర్పులు ఖాయమేనన్న ప్రచారంతో ఆశావహులు అధ్యక్ష స్థానంపై కన్నేశారు. సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని పావులు కదుపుతున్నారు. టీఎన్జీవోకు చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని జిల్లా కార్యవర్గంలో కీలక స్థానాల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ వైపు కార్యవర్గం కూర్పుకై పోటీ, మరోవైపు పాత వారిలో అలుముకున్న అసంతృప్తి వెరసి మొత్తంగా ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతున్నట్లు తెలిసింది. అటు కామారెడ్డి టీఎన్జీవో కార్యవర్గంలోనూ ముసలం రాజుకుంటున్నది.

**కదిలించిన 'నమస్తే' కథనం..**

టీఎన్జీవోలో అనర్హులు ఉన్నారన్న వ్యవహారంపై 'నమస్తే తెలంగాణ' 2024 ఫిబ్రవరి 28న 'సీటు వదలం' అనే శీర్షికతో ప్రచురించిన కథనం ఉద్యోగ వర్గాలను ఆలోచనల్లో పడేసింది. అనర్హులదే రాజ్యం నడుస్తుందన్న వాదనకు బలం చేకూర్చేలా చాలా మంది టీఎన్జీవో సభ్యులు కేంద్ర నాయకత్వానికి, ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కి నమస్తే తెలంగాణలో వచ్చిన కథనాన్ని ఫిర్యాదులకు జత చేశారు. అనర్హులను తొలగించి అర్హులైన వారికే పదవులు కట్టబెట్టాలని, మార్పు కనిపించకపోతే తామంతా తప్పుకుని ప్రభుత్వ శాఖల వారీగా, కులాల వారీగా కొనసాగుతున్న ఉద్యోగ సంఘాల్లో పని చేసుకుంటామని అల్టిమేటం జారీ చేశారు.

**కొత్త జీవోతో మార్పు తథ్యం..**

ఈ వివాదానికి ప్రభుత్వం చెక్ పెట్టింది. గెజిటెడ్ ఉద్యోగులెవ్వరూ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘాల్లో కొనసాగడానికి వీల్లేదని ఉత్తర్వులు జారీ చేసింది. పదవులను త్యజించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించడం ద్వారా ప్రభుత్వమే ప్రచ్ఛన్న యుద్ధానికి తెర వేయనున్నది.

మరోవైపు, కామారెడ్డి జిల్లా టీఎన్జీవోలోనూ అంతర్యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. జిల్లా సెక్రెటరీగా పని చేసిన వ్యక్తి ఈ మధ్యే హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. సాంకేతికంగా ఈయనకు కామారెడ్డి టీఎన్జీవో పదవుల్లో కొనసాగకూడదు. స్వచ్ఛందంగానే తప్పుకోవాలి. కానీ అలా జరుగక పోవడంపై టీఎన్జీవో అధినాయకత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సెక్రెటరీ పోస్టుకు వేరే వారిని నియమించాలని కోరుతుండడంతో ఇక్కడ కూడా వివాదం రాజుకున్నట్లయింది. హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లిన సదరు ఉద్యోగి ఆన్ డిప్యుటేషన్(ఓడీ) ద్వారా తిరిగి కామారెడ్డి వచ్చేందుకు పాకులాడుతున్నట్లుగా తెలిసింది. ఓడీ పేరిట వచ్చి టీఎన్జీవో పదవిని కాపాడుకోవాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. డిప్యుటేషన్‌పై వచ్చే వారికి వర్కింగ్ ప్లేస్ ఉన్నటువంటి జిల్లాలో తప్ప ఇతర జిల్లాల్లో టీఎన్జీవో పదవులను చేపట్టే అవకాశం లేదని బైలా చెబుతుండడం విశేషం.

**త్వరలోనే ఎలక్షన్లు..**

కొన్నేండ్లుగా నిజామాబాద్ టీఎన్జీవోస్‌లో ఎన్నికలు అన్నవే లేకుండా పోయాయి. గతంలో సీనియర్ నాయకుల సలహాలు, సూచనల మేరకు తాలూక స్థాయిలో మొదటగా ఎన్నికలు నిర్వహించే వారు. ఆ తర్వాత జిల్లా స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకునే వారు. దశాబ్ద కాలంగా ఈ తరహా ప్రక్రియ నామమాత్రంగానే కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏకఛత్రాధిపత్యంలో అంతా తానై వ్యవహరించిన కీలక నేత ఇదేది పాటించకుండానే కొత్త సభ్యత్వాలను ప్రోత్సహించకుండానే కార్యవర్గాల్లో తనకు నచ్చిన వారికి చోటు కల్పించారని ఉద్యోగులు మండిపడుతున్నారు. జీఏడీ నుంచి వచ్చిన ఆదేశాలతో ఎట్టకేలకు టీఎన్జీవో కేంద్ర నాయకత్వం ఈ వ్యవహారాలపై దృష్టి సారించడంపై సభ్యుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. నాన్ గెజిటెడ్ సంఘంలో గెజిటెడ్ ఉద్యోగులకు స్థానం లేకపోయినప్పటికీ, బైలాను తుంగలో తొక్కి కొందరు పదవులను దక్కించుకున్నారు. ఇప్పుడు బైలాను ముందు పెట్టి నిబంధనల మేరకు అర్హులైన వారికే పదవులను అంటగట్టేందుకు టీఎన్జీవో నాయకత్వం చర్యలు చేపట్టింది. ఈ హఠాత్పరిణామాలు ఏళ్లుగా పాతుకుపోయిన వారిలో షాక్‌కు గురి చేస్తుండగా, సభ్యుల్లో కొంగొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. త్వరలోనే ఎన్నికలు జరుగుతుండటంతో టీఎన్జీవోకు మంచి రోజులు వచ్చాయంటూ సంబురాలు చేసుకుంటున్నారు.

# ఉద్యమ నేత కన్నుమూత

- రైతు నాయకుడు మనోహర్‌రెడ్డి మృతి
- పసుపుబోర్డు కోసం దశాబ్దాల పోరాటం
- కల నెరవేరకుండానే ఆగిన శ్వాస



ముత్యాల మనోహర్‌రెడ్డి (ఫైల్)

మోర్తాడ్, సెప్టెంబర్ 14: పసుపుబోర్డు ఉద్యమకారుడు, రైతు నాయకుడు ముత్యాల మనోహర్‌రెడ్డి (75) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన ఆయన పసుపు బోర్డు కోసం దశాబ్దాలుగా పోరాటం కొనసాగించారు. చివరకు ఆయన సుదీర్ఘ కల అయిన టర్మరిక్ బోర్డు స్థాపనను చూడకుండానే మృతి చెందారు. తొలి నుంచి రైతు, ప్రజా సమస్యలపై పోరాట పంథాను ఎంచుకున్న మనోహర్‌రెడ్డి పాలెం గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. ఆ తర్వాత ప్రధానంగా రైతు సమస్యలపైనే ఉద్యమించడం ప్రారంభించారు. ఒకప్పుడు అన్నదాతలకు సిరులు కురిపించిన పసుపు పంటకు గిట్టుబాట ధర దక్కకపోగా నష్టాలు తెచ్చిపెడుతుండడం చూసి కలవరపాటుకు గురైన మనోహర్‌రెడ్డి.. పసుపుబోర్డుతోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావించారు. అందుకోసం దశాబ్దాలుగా పోరాటం చేశారు. బోర్డు వచ్చే వరకూ చెప్పులు వేసుకోనని శపథం చేసిన ఆయన ఆ మాట మీదే నిలబడ్డారు. అలాగే, తిరుపతి వరకు పాదయాత్ర చేశారు. పసుపుబోర్డు కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మరోవైపు, ఎర్రజొన్నల బకాయిల విషయంలో రైతుల ఆందోళనలను ముందుండి నడిపించారు. కేంద్ర ప్రభుత్వం పసుపుబోర్డు ఇస్తామని ప్రకటన చేయగానే చెప్పులు వేసుకోవడం ప్రారంభించిన మనోహర్‌రెడ్డి.. బోర్డు స్థాపన, కార్యకలాపాలను కళ్లారా చూడకుండానే కన్నుమూశారు. కేంద్ర ప్రభుత్వ జాప్యం వల్లే ఆయన సుదీర్ఘ కల నెరవేరకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




విలేకరులతో మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు వి.ప్రభాకర్, లింగారెడ్డి, యాదాగౌడ్

# మాఫీ చేయకుంటే రణమే

- కాంగ్రెస్ హామీలను నెరవేర్చాల్సిందే
- రేపు తహసీల్ ఆఫీసుల ఎదుట ధర్నా
- రైతు ఐక్య కార్యాచరణ కమిటీ వెల్లడి

ఖలీల్‌వాడి/ఆర్మూర్, సెప్టెంబర్ 14: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ స్పష్టం చేసింది. షరతుల్లేకుండా రూ.2 లక్షల రుణమాఫీతో పాటు రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.15 వేల చొప్పున వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో సోమవారం తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేయనున్నట్లు ప్రకటించింది. 15వ తేదీ వరకు తాము విధించిన గడువు ముగియనుందని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్మూర్‌లో శనివారం సమావేశమైన కమిటీ ప్రతినిధులు వి.ప్రభాకర్, ఇట్టడి లింగారెడ్డి, దేగాం యాదాగౌడ్, దేవరాం, గంగారాం తదితరులు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. మాట తప్పిన కాంగ్రెస్ సర్కారు తీరుకు నిరసనగా 16వ తేదీన ఆర్మూర్ డివిజన్‌లో ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధానంగా ఎలాంటి షరతుల్లేని రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాలేనన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా కొందరికే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని, రైతుభరోసాకు అతీగతీ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు . రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని, రూ.2లక్షల రుణాలన్నింటినీ మాఫీ చేయాలని, అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రైతు కుటుంబాల్లో విషాదం

- వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి
- గడ్డి కొస్తూ ఒకరు, పొలానికి వెళ్తుండగా మరొకరు దుర్మరణం




కృష్ణ ,ఎల్లయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట/రాజంపేట్, సెప్టెంబర్ 14: కరెంట్ రైతు కుటుంబాల్లో విషాదం నింపింది. గడ్డి కోస్తుండగా వైర్లకు తగలడంతో ఓ రైతు దుర్మరణం చెందగా, పొలానికి వెళ్తుండగా తీగలు తగిలి మరొకరు మృతి చెందాడు. రాజంపేట్ మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముక్కిరి రాజయ్య (41) రోజులాగే శనివారం తన పొలానికి వెళ్లాడు. బోరు చుట్టూ గడ్డి పెరగడంతో దాన్ని కోస్తుండగా, విద్యుత్ తీగలు కొడవలికి తగిలాయి. దీంతో ఒక్కసారిగా కరెంట్ షాక్‌కు గురై ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

**పొలానికి వెళ్లి..**

రాత్రివేళ పొలానికి వెళ్లిన మరో రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జోడు కృష్ణ (40)కు భార్య సునీత, ఇద్దరు కుమారులు ఉన్నారు. శుక్రవారం రాత్రి భోజనం చేసిన అనంతరం పొలానికి వెళ్లి వస్తానని చెప్పి కృష్ణ ఇంటి నుంచి బయల్దేరాడు. అయితే, శనివారం ఉదయం వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో భార్య చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. బంధువులు పొలానికి వెళ్లి చూడగా, బోడు రాములు మోటార్ స్టార్టర్ డబ్బా వద్ద కరెంట్ తీగలకు వేలాడుతూ కనిపించాడు. పొలానికి వెళ్తుండగా, కాలు జారి తీగలపై పడడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.




రాజస్థాన్ భవన్ ఆధ్వర్యంలో..



శ్రీ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..





రైసింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో..



హిందూ భక్త గణేశ్ మండలి ఆధ్వర్యంలో






ఆర్యమాత గణేశ్ మండలి ఆధ్వర్యంలో ..

# విభిన్న రూపాల్లో వినాయకుడు

- జిల్లా కేంద్రంలో ఆకట్టుకుంటున్న సెట్టింగులు
- రంగురంగుల విద్యుద్దీపాలతో ప్రత్యేక అలంకరణ

**పట్టణంలో వాడవాడలా** గణనాథులు కొలువుదీరారు. కుల, యువజన సంఘాల ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఉన్న వినాయకుడి ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయాల్లో మండపాల వద్ద సాంస్కృతిక, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ సెట్టింగులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గణనాథులను తిలకించేందుకు భక్తులు తరలివస్తున్నారు. -స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



భజరంగ్ యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ..





దుబ్బ గణేశ్ మండలి ఆధ్వర్యంలో..



భక్తహిందూ గణేశ్ మండలి ఆధ్వర్యంలో గుమ్మడికాయలతో తయారుచేసిన బొజ్జ గణపయ్య